సాక్షి
బాపట్ల
గురువారం । 12 । జూన్ । 2025



## పున్నమి గరుడ సేవ

సత్తెనపల్లి: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో పున్నమి గరుడ సేవ నిర్వహించారు.



## దేశమ్మ తల్లికి పూజలు

పెదకూరపాడు: ఏరువాక పౌర్ణమి సందర్భంగా 75 త్యాళ్ళూరు గ్రామదేవత శ్రీదేశమ్మ తల్లికి బుధవారం శ్రీలలిత మహిళా కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నాగేశ్వర స్వామికి పూజలు



చేబ్రోలు: ఏరువాక పౌర్ణమి సందర్భంగా చేబ్రోలులోని నాగేశ్వర స్వామి బుధవారం ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇచ్చారు. పంటలు బాగా పండాలని స్వామికి పూజలు చేశారు.

## న్యూస్‌రీల్

### ముగిసిన చెన్నమల్లేశ్వరుని కల్యాణ వేడుకలు



రేపల్లె: ఇసుకపల్లిలోని భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న త్రైమాసిక కల్యాణ వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి పూర్ణాహుతి హోమం నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం, ధాన్యకుట్టునోత్సవం, త్రిశూల స్నానాలు, పవళింపు సేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

### 81 కలశాలతో వేంకటేశ్వర స్వామికి అభిషేకం





తాడేపల్లి రూరల్ : సీతానగరం విజయ కీలాద్రి దివ్యక్షేత్రంపై ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి బుధవారం 81 కలశాలతో అభిషేకాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళశాసనాలతో జ్యేష్ఠ నక్షత్రం సందర్భంగా ఉదయం 9 గంటలకు స్వామి వారికి 81 కలశాలతో అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. అనంతరం హయగ్రీవ హోమం, అష్టోత్తర శతనామార్చన, పూర్ణాహుతి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

### జీజీహెచ్‌లో నీటి సరఫరాకు అంతరాయం

– తక్షణమే పునరుద్ధరణ



గుంటూరు మెడికల్: గుంటూరు మున్సిపాలిటీకి చెందిన ప్రధాన 'ఎ' లైన్‌లో నీటి వాల్వ్ మరమ్మతులకు గురైంది. ఈ పైపులైన్ ద్వారా గుంటూరు జీజీహెచ్‌లోని ఏడు భవనాలను నీరు సరఫరా అవుతోంది. ఈ సరఫరాలో ఏర్పడిన అంతరాయం కారణంగా ఆరు భవనాలకు సరిపడా నీరు అందుబాటులో ఉండగా, ఒక భవనానికి మాత్రమే తాత్కాలికంగా నీటి సరఫరా నిలిచిపోయిందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి బుధవారం తెలిపారు. విషయం మున్సిపాలిటీ అధికారులకు తెలియజేయగా 90 నిమిషాల్లోనే వాటర్ ట్యాంకర్‌ను పంపించి ఆ భవనానికి నీటిని అందించారన్నారు. నీటి సమస్య కేవలం మంగళవారం ఒక్కరోజే మాత్రమే తలెత్తిందని తెలిపారు. గత నాలుగు రోజులుగా ఎటువంటి అంతరాయం లేదన్నారు.

### కొండవీడు కోటలో యోగా కార్యక్రమం రద్దు



యడ్లపాడు: కొండవీడు కోటలో బుధవారం ఉదయం జరగాల్సిన ప్రత్యేక యోగా కార్యక్రమం అకాల వర్షం కారణంగా రద్దయింది. జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు ఆధ్వర్యంలో టూరిజం, అటవీ శాఖల పర్యవేక్షణలో వివిధ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని ఘాట్‌రోడ్డులోని చెక్‌పోస్టు వద్ద ఉదయం 6 గంటల నుంచి గంటన్నరపాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వర్షం కారణంగా చివరి క్షణంలో రద్దు చేశారు. ఈ నెల 18న అమరావతిలోని జ్ఞాన బుద్ధ ప్రాంతంలో చివరి యోగా కార్యక్రమం జరగనుంది.

# నారా కయాతనే!

## కూటమి పాలనలో కక్ష సాధింపు మినహా సంక్షేమం శూన్యం

- సూపర్ సిక్స్ అంటూ ప్రజలను నట్టేట ముంచిన సీఎం చంద్రబాబు
- రెడ్‌బుక్ పేరుతో దారుణ హత్యలు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, వేధింపులు
- రోజురోజుకూ మహిళలు, బాలికలపై పెరుగుతున్న అఘాయిత్యాలు
- అధికారంలోకి వచ్చాక హామీలన్నింటినీ గాలికొదిలేసిన సర్కారు
- నిబంధనలకు విరుద్ధంగా తమ్ముళ్ల ఇసుక, బుసక, గ్రావెల్, గ్రానైట్ విక్రయాలు
- నెలకు రేషన్ బియ్యంతో రూ. 25 లక్షలను దోచుకుంటున్న పచ్చ నేతలు
- జిల్లాలో అడుగడుగునా బెల్టు షాపులతోపాటు పేకాట, కోడిపందేల జోరు

అరచేతిలో ప్రజలకు వైకుంఠం చూపిన కూటమి నేతలు అధికారం చేజిక్కించుకుని ఏడాదైంది. అన్ని వర్గాల ప్రజలను సీఎం నారా చంద్రబాబు నరక యాతనే పెడుతున్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు, వ్యాపారులు.. ఇలా అన్నివర్గాలను నట్టేట ముంచారు. నిలువునా మోసం చేసి బూటకపు మాటలతో పూట పూటకు మాయ చేస్తూ పబ్బం గడుపుతున్నారు. ఏడాది గడిచినా ఒక్క సంక్షేమ పథకం అమలుకాలేదు. అభివృద్ధి ఆనవాలు అసలే కనిపించడం లేదు. రెడ్ బుక్ పేరిట అరాచక పాలన మాత్రమే పాలకులకు చేతనైంది. అడ్డగోలుగా కూటమి నేతలు రూ.కోట్లకు పడగలెత్తేలా పరిపాలన సాగుతోంది.



సాక్షి ప్రతినిధి, బాపట్ల: కూటమి వంచన పాలనకు ఏడాది పూర్తయింది. ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పేరిట ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ చంద్రబాబు సర్కారు నెరవేర్చలేదు. నమ్మించి మోసగించిన సర్కార్‌పై పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఎన్నికల్లో ఓట్లేయించుకొని గద్దెనెక్కాక వంచిచడంపై మండి పడుతున్నారు. ఇచ్చిన మాట సంగతి దేవుడెరుగు చంద్రబాబు పాలనలో అవినీతి, అక్రమాలు పతాక స్థాయికి చేరాయి. ఇసుక, బుసక, గ్రానైట్, గ్రావెల్‌ను ట్రిప్పుల లెక్కన విక్రయించి జేబులు నింపుకొంటున్నారు. పేదల కడుపుకొట్టి చౌక బియ్యాన్ని ఒక్కో ప్రజాప్రతినిధి నెలకు రూ. 25 లక్షలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెడ్‌బుక్ పాలనను తెరపైకి తెచ్చి హత్యలు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు అంటూ ప్రతిపక్ష పార్టీలతోపాటు సామాన్య ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారు. ఏ ఒక్కవర్గం సంతృప్తిగా లేదు. మొత్తంగా కూటమి ఏడాది పాలన ప్రజాకంఠకంగా మారడంతో జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అడ్డగోలుగా 'పచ్చ' దోపిడీ

పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరు, అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ ప్రాంతాల నుంచి రోజూ రూ.కోట్ల విలువైన గ్రానైట్ పలకలు ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలు, దేశాలకు తరలిపోతున్నాయి. పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరు, ఇంకొల్లు ప్రాంతాల నుంచి నిత్యం గ్రావెల్ అక్రమ రవాణా సాగుతోంది, చినగంజాం, కడవకుదురు ప్రాంతాల నుంచి జిల్లాతోపాటు తెలంగాణకు ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. చీరాల నియోజకవర్గంలో ప్రభుత్వ, అసైన్డ్, అటవీ శాఖ భూముల నుంచి అక్రమంగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సముద్ర తీర ప్రాంతాన్ని కూడా వదలడం లేదు. టోల్‌గేట్లు పెట్టి పర్యాటకుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో అసైన్డ్ భూములను ఆక్రమించి లేఅవుట్లు వేసి అమ్మేస్తున్నారు.

### పేదల బియ్యాన్నీ వదల్లేదు...

జిల్లాలో రేషన్ మాఫియా విజృంభిస్తోంది. ఒక్కొక్క పచ్చ ప్రజాప్రతినిధి పేదలకడుపు గొట్టి చౌక బియ్యాన్ని నెలకు రూ. 25 లక్షలకు విక్రయిస్తున్నారు. రేషన్ డీలర్లకు చేరకుండానే బియ్యం ప్రభుత్వ గోదాముల నుంచి నేరుగా మాఫియాకు చేరుతోంది. బియ్యం కావాలని అడిగితే రేషన్ కార్డులు రద్దు చేయిస్తామని పచ్చ నేతలు బెదిరిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు.

### అడ్డగోలుగా వసూలు

బాపట్ల నియోజకవర్గంలో తీరప్రాంతాన్ని అడ్డు పెట్టి పచ్చ నేతలు తాజాగా టోల్‌గేట్లు ఏర్పాటు చేశారు. పర్యాటకుల నుంచి వసూళ్లకు దిగారు. వెదుళ్లపల్లి ప్రాంతం నుంచి నిత్యం ఇసుక తరలించి అమ్ముకుంటున్నారు. చీరాల, బాపట్ల నియోజకవర్గాల్లో అక్రమ రిసార్టులు కుప్పలుతెప్పలుగా వెలుస్తున్నాయి. పర్యాటక శాఖ అనుమతులతో పనిలేకుండా పచ్చనేతలు మామూళ్లు పుచ్చుకొని అనధికార అనుమతులు ఇస్తున్నారు. అక్రమ లేఅవుట్ల వ్యాపారం ఇక్కడి పచ్చనేతలకు ఆదాయ వనరుగా మారింది. పిట్టలవానిపాలెం, కర్లపాలెం ప్రాంతాల్లో పేకాట, కోడి పందేలు జోరుగా నడుస్తున్నాయి.

వేమూరు నియోజకవర్గంలో కృష్ణానది నుంచి నిత్యం అక్రమంగా ఇసుకను తరలించి అమ్ముకుంటున్నారు. పేకాట, కోడిపందేలు అడ్డూఅదుపూ లేకుండా సాగుతున్నాయి. ఇక్కడ మట్టి వ్యాపారం పచ్చ నేతలకు కాసులు కురిపిస్తోంది. రేపల్లె నియోజకవర్గంలో పేకాట, కోడిపందేలు జోరుగా నడుస్తున్నాయి.

### రైతన్నలు కుదేలు

కూటమి పాలనలో జిల్లాలో అభివృద్ధి సంగతి దేవుడెరుగు పచ్చనేతల అక్రమార్జనకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ధాన్యం మొదలు మిర్చి, పొగాకు, శనగ.. ఇలా ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధర లేదు. పెట్టుబడులు కూడా రాక అప్పులపాలైన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం కనికరించిన పాపాన పోలేదు.

### ఊరూరా బెల్ట్ షాపులు

జిల్లా వ్యాప్తంగా బెల్టు షాపులు ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. గ్రామ గ్రామాన ఇప్పటికే షాపులు పెట్టారు. బెల్టు షాపులకు రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు డిపాజిట్లు కూడా తమ్ముళ్లు వసూలు చేస్తున్నారు. మద్యం డోర్ డెలివరీ సదుపాయం కూడా కల్పించారు. పేదల బలహీనతను ఆసరా చేసుకుని వారిని నిత్యం మత్తులో ముంచెత్తి అందినకాడికి దోచుకుంటున్నారు.

### సూపర్‌సిక్స్ పేరుతో వంచన

- అన్నదాత సుఖీభవ పేరుతో రైతుకు ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామన్నారు. రెండో ఖరీఫ్ సీజన్ వచ్చినా జిల్లాలోని 1,92,087 మంది రైతులకు ఇవ్వాల్సిన రూ. 384.06 కోట్లలో పైసా ఇవ్వలేదు.
- తల్లికి వందన పేరుతో ప్రతి విద్యార్థికి రూ. 15 వేలు ఇస్తామన్నారు. జిల్లాలోని 2,35,654 మందికి రూ. 353.48 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు చిల్లిగవ్వ కూడా విదల్చలేదు.
- నెలకు రూ. 3 వేలు నిరుద్యోగభృతి అన్నారు. జిల్లాలో 4,77,557 కుటుంబాల పరిధిలో ఇంటికొక్కరు అనుకున్నా వారందరికీ చెల్లించాల్సిన రూ. 143. 26 కోట్లలో పైసా రాలేదు.
- మహిళలకు ప్రతినెల రూ. 1500 ఇస్తామన్నారు. జిల్లాలో 19 నుంచి 59 ఏళ్ల వయస్సున్న వారు 6,61,841 మంది. వీరందరికీ ఏడాదికి రూ. 11,913 కోట్లు ఇవ్వాలి. ఇప్పటికీ ఆ ఊసే మరిచారు.
- ఏడాదికి 3 వంట గ్యాస్ సిలిండర్లు ఉచితం అని చెప్పారు. జిల్లాలో మొత్తం 4,60,836 గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయి. మూడు ఉచిత సిలిండర్లకు ఒక్కొక్కరికి రూ. 2,700 చొప్పున ఇవ్వాలి. ప్రభుత్వం 3 లక్షల మందిని మాత్రమే లబ్ధిదారులుగా ఎంపిక చేసింది. మిగతా వారికి ఎగనామం పెట్టింది.
- మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణమన్నారు. జిల్లాలో ఉన్న ఆర్టీసీ బస్సులలో ప్రయాణికుల గణాంకాల ప్రకారం రోజూ 90 వేల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చలేదు.

### రెడ్ బుక్ పేరిట అరాచకాలు



రెడ్ బుక్ పాలనను జిల్లాలో అమలు చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలు, కార్యకర్తలే కాకుండా ప్రభుత్వ వైఫల్యాలను నిలదీసిన సామాన్యా ప్రజలను సైతనం టార్గెట్ చేస్తున్నారు. పలుచోట్ల హత్యలు చేస్తున్నారు. దౌర్జన్యాలకు తెగబడుతున్నారు. అక్రమ కేసులు బనాయించి జైళ్ల చుట్టూ తిప్పుతూ రాక్షసానందం పొందుతున్నారు. వేమూరు, రేపల్లె, అద్దంకి, పర్చూరు ప్రాంతాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేయడమే కాకుండా.. వారిపైనే అక్రమ కేసులు బనాయించారు. ఇలా పలువుర్ని జైళ్లకు పంపారు. వారి ఇళ్లను కూడా వదిలిపెట్టకుండా కూలగొట్టారు.

- నగరం మండలం దాసరిపాలెంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సున్నా భూషయ్యను పచ్చ పార్టీ నాయకులు ఏకంగా హత్య చేశారు. రెడ్ బుక్ పాలన పేరిట ఇప్పటికే ఎనిమిదికిపైగా హత్యలు జరిగాయి.
- బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను చంద్రబాబు ప్రభుత్వం టార్గెట్ చేసింది. ఆయనపై వరుస కేసులు బనాయించి హింసిస్తోంది.
- వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం అద్దేపల్లి ఎస్సీ కాలనీలో దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని పచ్చ పార్టీ వారు పెట్రోల్ పోసి తగులబెట్టగా నిరసనకు దిగిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబుపై పోలీసులు అక్రమ కేసులు పెట్టారు.
- పర్చూరు నియోజకవర్గం యద్దనపూడి మండలానికి చెందిన పలువురు ఎస్సీ నేతలపై పచ్చ ప్రభుత్వం రౌడీషీట్లు ఓపెన్ చేసి కక్షపూరితంగా వ్యవహరించింది.
- రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లి మండలం రాంబొట్లవారిపాలెంకు చెందిన దళిత నాయకుడు రాజ్‌కుమార్ ఇంటిపై దాడి చేసి తీవ్రంగా కొట్టి గాయపరిచారు.
- ఇదే మండలం గుళ్లపల్లికి చెందిన మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావుపై పలుమార్లు దాడులకు యత్నించారు. ఆయన డ్రైవర్ గాలి సంపత్‌కుమార్ అనే దళితుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.
- అద్దంకి మండలం ధర్మవరానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల నేత ప్రభాకరరెడ్డి, ఆయన అనుచరులపై అక్రమ కేసులు పెట్టి వేధించారు. ఆయన పెట్రోల్ బంకుకు నిప్పు పెట్టారు. జేసీబీలను తగులబెట్టారు.

# రమణీయం వేణుగోపాలుని రథోత్సవం

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి రథోత్సవం బుధవారం నేత్రశోభితంగా జరిగింది. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం అనంతరం రథోత్సవం నిర్వహించటం ఆనవాయితీ. గత సంవత్సరం రూ.1.80 లక్షలతో నూతన రథనిర్మాణం చేపట్టారు. ఈ ఏడాది రథాన్ని భద్రపరిచేందుకు రథశాల నిర్మాణం చేపట్టి బుధవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్చకులు దీవి భావనాచార్యులు వేదపండితుల ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు చేశారు. ఉదయం గరుడవాహనంపై స్వామి వారికి గ్రామోత్సవం జరిగింది. 11 గంటలకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. సాయంత్రం 4 గంటలకు ఏరువాక ఉత్సవాల్లో భాగంగా రైతులు తమ ఎద్దులను, ట్రాక్టర్లను సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. 5 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీలో రథం వద్దకు తోడ్కొని వచ్చారు. ఈ సందర్భంగా రథం వద్ద ఏర్పాటు చేసిన యాగశాలలో రథాంగ హోమం, రథాంగబలి, దృష్టికుంభం, మంచి రాచ గుమ్మడికాయలతో రథానికి దిష్టితీసి కొబ్బరికాయలతో సాత్వికబలి సమర్పించారు. అనంతరం స్వామి వార్లను రథంపై అధిష్టింపచేశారు. స్వామి వారిని చూసేందుకు భక్తులు రహదారులకు ఇరువైపులా బారులుతీరారు. ఈ రథయాత్ర ఆలయం నుంచి 2 కిలోమీటర్ల మేర సాగి, తిరిగి ఆలయానికి చేరుకోవటంతో ఘట్టం ముగిసింది. భక్తులు రథాన్ని లాగుతూ గోవింద నామస్మరణ చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అడుగడుగునా స్వామి వారికి మంగళ హారతులతో నీరాజనాలు సమర్పించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై రత్నకుమారి తమ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీఎల్ కుమార్ భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.



ఉత్సవమూర్తులు



# తడ'బడి'న చదువులు

- కూటమి ప్రభుత్వ పాలనలో కొరవడిన నియంత్రణ
- విద్యార్థుల తల్లిదండ్రులకు తప్పని ఆర్థిక కష్టాలు
- బడులు తెరుస్తుండటంతో కన్నవారిలో మొదలైన కలవరం
- ప్రభుత్వ పాఠశాలల్లో అస్తవ్యస్తంగా ఉపాధ్యాయుల బదిలీలు
- పూర్తికాని అభివృద్ధి పనులతో విద్యార్థులకు అవస్థలు
- పిల్లలను చదివించేందుకు ఆసక్తి చూపని తల్లిదండ్రులు
- ప్రైవేటు పాఠశాలల ఫీజులపై నియంత్రణ ఉండాలంటున్న నిపుణులు
- నేటి నుంచి తెరుచుకోనున్న ప్రభుత్వ పాఠశాలలు

కూటమి పాలనలో బడుగు కుటుంబాల్లోని పిల్లలకు విద్య అందని ద్రాక్షగా మారింది. ప్రభుత్వ పాఠశాలలు సమస్యలతో నూతన విద్యాసంవత్సరానికి స్వాగతం పలకనున్నాయి. ప్రైవేటు బడుల్లో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారు. దీంతో కన్నవారికి పెద్ద కష్టమే వచ్చి పడింది. అటు సర్కారు పాఠశాలలకు పంపలేక.. ఇటు ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని తట్టుకోలేక సతమతం అవుతున్నారు. ప్రభుత్వం తల్లికి వందనం కింద ఇస్తానన్న సాయం కూడా అందక విలవిల్లాడుతున్నారు.



బస్సులో ప్రైవేటు పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)



అసంపూర్తిగా ఉన్న పిన్నిబోయినవారిపాలెం పాఠశాల మరుగుదొడ్లు

బాపట్ల టౌన్ :పిల్లలను బడికి పంపించాలంటేనే తల్లిదండ్రులు నెల రోజుల ముందు నుంచే కలవరానికి గురవుతున్నారు. రూ.వేలకు వేలు ఫీజులు కట్టాల్సి వస్తోంది. పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం, స్కూల్ బస్సు ఫీజులు వెరసి తల్లిదండ్రులకు రూ. 20 నుంచి రూ.30 వేలు కూడా సరిపోని పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు వాపోతున్నారు. వేసవి సెలవులు అయిపోతున్నాయంటేనే వారిలో టెన్షన్ వాతావరణం నెలకొంది. బడి తెరిస్తే ఫీజులు ఎలా కట్టాలా...? అంటూ మధ్యతరగతి, పేద కుటుంబాలు సతమతం అవుతున్నాయి.

### ఎల్‌కేజీ నుంచే భారీగా..

ఎల్‌కేజీలో పిల్లలకు అంతగా ఏమీ నేర్పరు. అయినప్పటికీ ఓ మోస్తరు ప్రైవేటు స్కూల్‌లోనూ విద్యార్థికి రూ. 10 వేల నుంచి రూ.15 వేలు వసూలు చేస్తున్నారు. అదే కార్పొరేట్ స్కూళ్లయితే సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పి రూ. 20 వేల నుంచి రూ. 50 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక పదో తరగతి వరకు అయితే గ్రామీణ, మండల స్థాయి బడుల్లో రూ. 20 వేల నుంచి రూ.30 వేలు తీసుకుంటున్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో రూ. 50 నుంచి రూ.70 వేలు పైనే వసూలు చేస్తున్నారు. వీటికి యూనిఫామ్ పేరిట మరో రూ. 5 వేలు, బస్సు ఫీజు దూరాన్ని బట్టి నెలకు రూ. 1500 నుంచి రూ.2500 వరకు చెల్లించాల్సి వస్తోంది. ఇక పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ఆయా స్కూళ్లలోనే తప్పనిసరిగా కొనాలని నిబంధన పెట్టి రూ. పది వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇదంతా పాఠశాల మొదలయ్యేటప్పుడు పెట్టాల్సిన ఖర్చు కావడంతో తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు.

### రకరకాల పేర్లతో వసూలు

ఇక తరగతులు జరిగే కొద్దీ ఏడాది చివరకు వచ్చేసరికి గైడ్‌లు, క్వశ్చన్ బ్యాంక్‌లు, స్టడీ మెటీరియల్, పరీక్షల ఫీజులు, ఐడీ కార్డులు, డైరీలు, వెల్‌కం, ఫేర్‌వెల్ పార్టీలు, వార్షికోత్సవాలు.. ఇలా వివిధ పేర్లతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.వేలల్లో వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చదివించాలంటే మధ్య తరగతి కుటుంబాలు అప్పు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఆయా కార్పొరేట్ స్కూళ్లు ఐఐటీ, ఒలింపియాడ్ పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి అదనంగా రూ. 4 వేల నుంచి రూ. 8 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించి ప్రైవేటు పాఠశాలల్లో యూనిఫాం, నోట్‌పుస్తకాలు, బస్సుల ఫీజులు, పాఠశాల ఫీజు వసూళ్ల విషయంలో చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### కొరవడిన పర్యవేక్షణ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పాఠశాలలకు పూర్వవైభవం తీసుకువచ్చేలా నాడు-నేడుతో వాటి రూపురేఖలనే మార్చేశారు. డిజిటల్ తరగతి గదులు, తరగతి గదిలో ఫ్యాన్లు, బల్లలు, ఆకర్షణీయమైన బ్లాక్‌బోర్డులు, మరుగుదొడ్లు వంటి సకల వసతులతో బడులు పిల్లలకు స్వాగతం పలికేవి. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది ముగిసినా నేటివరకు ఒక్క పాఠశాలలో కూడా అభివృద్ధి పని చేసిన దాఖలాలు లేవు. కనీసం నాడు-నేడు పనుల్లో మిగిలిన వాటిని కూడా పూర్తి చేయలేదు. నిధులు ఇవ్వకుండా అర్ధాంతరంగా నిలుపుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై కూటమి సర్కార్ సవతి తల్లి ప్రేమ చూపుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఫీజులపైనా నియంత్రణ ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## క్లుప్తంగా

### శిడి మహోత్సవం ఆదాయం రూ.4.37 లక్షలు



**వేటపాలెం:** రామన్నపేట శివారులో వేంచేసి యున్న కనక నాగవరపమ్మ అమ్మవారి శిడిమహోత్సవం సందర్భంగా ఆలయానికి రూ. 4.37 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈఓ పోతిన శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. విరాళాల ద్వారా రూ. 49,700, సాధారణ దర్శనం రూ.33,600, ప్రత్యేక దర్శనాలు రూ. 48,260, షాపులు రూ.81,800, కానుకల హుండీ ద్వారా రూ. 2,24,012 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. మొత్తం రూ.4,37,372 లక్షలు ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

### డ్రెయిన్‌లో పడి మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యం

**పెనమలూరు:** కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరు వద్ద కొద్ది రోజుల క్రితం డ్రెయిన్‌లో పడి మృతి చెందిన వ్యక్తి ఆచూకీని పోలీసులు బుధవారం గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం వంకాయలపాడు గ్రామానికి చెందిన తుమ్మిడిపాటి శివ (44) పెళ్లి పనుల కోసం ఈ నెల ఆరో తేదీన విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు వచ్చాడు. అదే రోజు రాత్రి అతను మద్యం మత్తులో నడుచుకుంటూ కానూరు పీవీఆర్‌ఐకాన్ బిల్డింగ్ వద్దకు చేరుకున్నాక డ్రెయిన్‌లో పడి మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలతో 'సాక్షి'లో మృతుడి ఫొటోతో ఈ నెల ఎనిమిదో తేదీన వార్త ప్రచురితమైంది. ఈ సమాచారం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు పెనమలూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. వారి నుంచి పోలీసులు పూర్తి వివరాలు సేకరించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించారు.

### వృద్ధురాలి నేత్రదానం



**ప్రత్తిపాడు:** తాను మరణించినా నేత్రాలు మూతపడకూడదని భావించిన ఓ వృద్ధురాలు వాటిని దానం చేశారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు గ్రామానికి చెందిన వృద్ధురాలు మండెపూడి హేమలత (66) నేత్ర దానం చేసి మరణానంతరం మరొకరికి ఈ లోకాన్ని చూసే అవకాశాన్ని కల్పించారు. హేమలత బుధవారం గొట్టిపాడులోని స్వగృహంలో మధ్యాహ్నం కన్నుమూశారు. ఆమె కోరిక మేరకు నేత్రాలను శంకర కంటి ఆస్పత్రి డాక్టర్ శ్రీనిజ బృందం సేకరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారికి గ్రామస్తులు, పెద్దలు అభినందనలు తెలిపారు.

# ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



జోనల్ చైర్మన్‌కు వినతి పత్రం అందిస్తున్న ఉద్యోగులు

**బాపట్ల:** ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని బుధవారం బాపట్లకు విచ్చేసిన ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు రీజియన్ చైర్మన్ ఎస్ సురేష్ రెడ్డికి బాపట్ల ఆర్టీసీ డిపో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మున్నంగి కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న పాత బస్సుల స్థానంలో కొత్తవి కొనుగోలు చేయాలన్నారు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన బాపట్లకు అన్ని ప్రాంతాలను అనుసంధానిస్తూ కొత్త సర్వీసులు అందుబాటులోకి తేవాలని కోరారు. జిల్లా కేంద్రం స్థాయికి తగ్గట్టు ఆర్టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, అద్దె బస్సుల కార్మికులకు చట్ట ప్రకారం వేతన సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ బస్సులు కేటాయించాలన్నారు. పీఆర్సీ, డీఏలను వెంటనే మంజూరు చేసేందుకు కృషి చేయాలన్నారు. చీరాల– బాపట్ల డిపోలలో సెక్యూరిటీ సిబ్బందిని అదనంగా నియమించాలన్నారు. బాపట్ల గ్యారేజీ, కొత్త బస్టాండులో గుంతలను పూడ్చివేయించాలని కోరారు. యూనియన్ నాయకులు భోగిరెడ్డి తిరుమలరెడ్డి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు. కొత్త బస్టాండ్‌ను సురేష్ రెడ్డి పరిశీలించారు. మినరల్ వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్లి సిబ్బందికి సూచనలు చేశారు. ఆర్టీసీ డిపో, కొత్త బస్టాండు, పాత బస్టాండులో సమస్యలను డిపో మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. కొత్త బస్టాండ్ ఆవరణలో నిలిచిన వర్షపు నీటిలోనే ఆయన పర్యటిస్తూ గుంతలమయమైన ప్రాంగణం చూసి అసహనం వ్యక్తం చేశారు. మరమ్మతులకు తక్షణమే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

# ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న కార్మికులు

**అద్దంకి:** ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ ఇంజినీరింగ్ కార్మికులు డిమాండ్ల పరిష్కారం కోసం బుధవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ – ఎంప్లాయీస్ ఫెడరేషన్ సీఐటీయూ అనుబంధం ఆధ్వర్యంలో అద్దంకి మున్సిపల్ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తంగిరాల వెంకటేశ్వర్లు సీఐటీయూ అద్దంకి మండల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు జీఓ నెంబర్ 36 ప్రకారం స్కిల్ కార్మికులకు రూ. 24000 ఇవ్వాలని.. అన్ స్కిల్ కార్మికులకు రూ. 21000, రూ. 24500 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతం సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని చనిపోయిన కార్మికులకు మట్టి ఖర్చులు కింద రూ. 20,000 ఇవ్వాలని కార్మికుల వారసులకు ఉద్యోగాలు కల్పించాలని.. సమాన పనికి సమాన వేతనం, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్డ్ బెనిఫిట్స్ కల్పించాలని, ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులను పర్మినెంట్ చేయాలని, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోవు కాలంలో కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని తెలియజేస్తూ అనంతరం మున్సిపల్ కమిషనర్ డి. రవీంద్రకు సమ్మె నోటీసు ఇచ్చారు. అలాగే జూలై 9 దేశవ్యాప్త ఒక రోజు సమ్మె నోటీసు కూడా ఇచ్చామని తెలిపారు. ఇంజినీర్ విభాగం యూనియన్ నాయకులు ఉసురుపాటి సామేలు, వి. జాన్, మారుతి, కోటేశ్వరరావు, మున్సిపల్ వర్కర్ యూనియన్ నాయకులు పి. ఆదాం, జి. భీష్మ, డైలీ కార్మికులు, నాయకులు, రాఘవయ్య, శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

# ముగిసిన ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం



క్రీడాదుస్తులు అందజేస్తున్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జైసన్‌బాబు

**చీరాల రూరల్:** చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని వైఎస్సార్ సీపీ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు అన్నారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ క్యాంప్ ఇన్‌చార్జ్ బొనిగల ప్రేమయ్య ఆధ్వర్యంలో ఎన్ఆర్ అండ్‌పీఎం హైస్కూలు క్రీడామైదానంలో గత 45 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి ఉచిత ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న 100 మంది క్రీడాకారులకు సర్టిఫికెట్లతో పాటు ఉచితంగా క్రీడాదుస్తులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిగా జైసన్‌బాబు పాల్గొని మాట్లాడారు. అకుంఠిత దీక్షతో చిన్నారులను చేరదీసి ప్రతిరోజూ సొంత ఖర్చులతో పౌష్టికాహారం అందిస్తూ వారికి ఫుట్‌బాల్ క్రీడలో మెళకువలు నేర్పించి మంచి నిష్ణాతులుగా తీర్చిదిద్దిన క్యాంప్ ఇన్‌చార్జ్ ప్రేమయ్యను, క్రీడాకారులకు మంచిగా శిక్షణనిచ్చిన కోచ్‌లను ఆయన అభినందించారు. శిక్షణ తీసుకున్న చిన్నారులు మంచి క్రీడాకారులుగా మన గలిగి తల్లి దండ్రులకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. నాలుగు జిల్లాల ప్రాంతీయ ఫుట్‌బాల్ కోఆర్డినేటర్ నూతలపాటి దేవదాసు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్, డాక్టర్ అబ్రహం బ్లెస్సీ, బొనిగల క్రాంతి, ఎరిచర్ల సాల్మన్‌రాజు, ఎస్. నరేష్, ఎస్. బాలశౌరి, కోచ్ ప్రసన్నకుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

### ఆటో, బైక్ ఢీ.. వ్యక్తి మృతి

**వేటపాలెం:** ఆటోను బైక్ ఢీ కొన్న సంఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తి మృతి చెందాడు. వేటపాలెం సెంటర్ నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లే మార్గంలో కుందేరు చప్టా వద్ద సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల మేరకు.. కుందేరు ప్రాంతంలో నివాసం ఉంటున్న ఎం. సురేష్ (36) చల్లా రెడ్డిపాలెంలో నివాసం ఉంటున్న తన తండ్రి ఇంటికి వెళ్లి రాత్రి 10 గంటల సమయంలో తిరిగి కుందేరు ప్రాంతంలోని తన ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. అదే సమయంలో వేటపాలెం వైపు నుంచి బైపాస్ రోడ్డు వైపు వేగంగా వెళుతున్న ఆటో చప్టా వద్ద అదుపు తప్పి చప్టాకున్న గోడకు గుద్దుకొని రోడ్డుకు అడ్డుగా వచ్చింది. అదే సమయంలో బైక్ వచ్చి ఆటోను ఢీ కొట్టింది. బైక్ నడుపుతున్న సురేష్ రోడ్డుపై పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సురేష్ మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై వెంకటేశ్వర్లు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రాష్ట్ర పోటీలకు జిల్లా అథ్లెటిక్ జట్టు ఎంపిక

**గుంటూరు వెస్ట్ (క్రీడలు):** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న ఏపీ సీనియర్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ఎంపిక చేశామని జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14వ తేదీ ఉదయం 6 గంటలకు పోటీలు జరిగే ప్రాంతంలో కోచ్ రవికుమార్‌కు వయస్సు ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డును అందించాలని సూచించారు.

# ఎన్‌సీసీ క్యాడెట్లకు ఫైర్ ఫైటింగ్‌పై శిక్షణ

**వేటపాలెం:** చీరాల ఇంజినీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో 23వ రాష్ట్ర బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ శిబిరంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు బుధవారం ఫైర్ ఫైటింగ్‌పై శిక్షణ నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వీవీ రామకృష్ణ ఆధ్వర్యంలో చీరాల అగ్నిమాపక శాఖ అధికారులు వాస్తవిక పరిస్థితుల్లో ఎలా స్పందించాలో వివరించారు. అగ్ని ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే పరికరాల వినియోగం గురించి లీడింగ్ ఫైర్ మెంబర్, సీహెచ్ బ్రహ్మయ్య వివరించారు. అనంతరం క్యాడెట్లు అగ్నిమాపక పరికరాలు ఉపయోగించి ప్రాక్టికల్ అనుభవం పొందారు. క్యాడెట్లలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే నైపుణ్యం పెంపొందడంతోపాటు సమాజ సేవ లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు వెల్లడించారు. అనంతరం అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ బృందాన్ని క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్ఎస్ పర్మర్, డిప్యూటీ క్యాంపు కమాండెంట్ దినేష్‌కుమార్‌లను ఘనంగా సన్మానించారు. మేజర్ వై. అంజిరెడ్డి, కెప్టెన్ పాతూరి శ్రీనివాస్, లెఫ్టినెంట్ హరీష్, రాజేష్ బాబు, దివ్య, శ్రీమన్నారాయణ, శేషగిరిరావు, ఫాతిమా, గోపినాథ్, సుబేదార్, మేజర్ ముకేశ్‌కుమార్, సమూర్, అవతార్‌సింగ్ పి. రమేష్ పాల్గొన్నారు.

# నాటు సారా నిర్మూలన అందరి బాధ్యత



రామ్‌నగర్ ప్రాంతంలోని వారితో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

**చీరాల:** నాటు సారా నిర్మూలనకు అందరు సహకరించి నాటుసారా రహిత గ్రామంగా చేసేందుకు కృషి చేయాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్ అన్నారు. బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఒంగోలు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు జనార్దన్, బి.వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సీఐలు, ఎస్సైలు చీరాల మండలం రామ్‌నగర్ గ్రామాన్ని సందర్శించారు. ప్రజలతో మాట్లాడి నాటుసారా నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. అలానే పలు నాటుసారా కేసులతో పాటు, పీడీ యాక్ట్ ఉన్న ముద్దాయిలతో మాట్లాడారు. నాటుసారా వదలాలని, నూతన జీవనోపాధికి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తాము సహకరిస్తామని హామీ ఇచ్చి వారి వివరాలను సేకరించారు. చీరాల ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

# భార్య హత్య కేసులో భర్త అరెస్ట్



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు

**బాపట్ల టౌన్:** భార్యపై పెట్రోలు పోసి నిప్పంటించి హత్య చేసిన కేసులో నిందితుడిని బుధవారం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను డీఎస్పీ రామాంజనేయులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ... మండలంలోని చెరువు జమ్ములపాలెం గ్రామం, ఆనంద్‌నగర్‌కు చెందిన దాసరి హరీష్ అలియాస్ దాసు ఈ నెల 9న తన భార్య సుభాషిణి(27) ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పెట్రోలు పోసి నిప్పటించాడు. తీవ్ర గాయాలతో బయటకు వచ్చేసరికి ఆమెను కాపాడేందుకు ఇంటి పక్కనే ఉన్న కొప్పుల సుధారాణి ప్రయత్నించిందన్నారు. కాపాడితే తనను కూడా చంపుతానని బెదిరించాడు. ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయింది. బాధితురాలి కేకలు విని గ్రామస్తులు గుమికూడటంతో నిందితుడు అక్కడి నుంచి ద్విచక్రవాహనంపై పారిపోయాడు. సుభాషిణిని చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలిస్తుండగా మృతి చెందింది. హరీష్ అలియాస్ దాసును బుధవారం పట్టణంలోని కమ్మ కల్యాణ మండపం సమీపంలో అరెస్ట్ చేశామన్నారు. నిందితుడికి కఠినమైన శిక్ష పడేలా త్వరితగతిన చార్జిషీట్ తయారు చేసి కోర్టుకు సమర్పిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ కె. శ్రీనివాసరావు, ఎస్ఐ ఐ. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### కొల్లిపరలో 45.2 మి.మీ. వర్షం

**కొరిటెపాడు(గుంటూరు):** జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 45.2 మిల్లీమీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 2.4 మి.మీ. పడింది. సగటున 21.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. కాకుమాను మండలంలో 38.6 మి.మీ., వట్టిచెరుకూరు 37.2, దుగ్గిరాల 36.8, చేబ్రోలు 34, తాడపల్లి 29.6, తుళ్లూరు 28.2, మంగళగిరి 27, పొన్నూరు 24, తెనాలి 18.2, తాడికొండ 14.8, పెదకాకాని 13.6 మి.మీ. చొప్పున వర్షం పడింది.

### విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణ



సమావేశంలో విద్యుత్ శాఖాధికారులు

**పర్చూరు(చినగంజాం):** పర్చూరు మండలంలో చీరాల విద్యుత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జాన్ థామస్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ ఎం. భాస్కరరావు, డీఈఈ విజయ్ శ్రీనివాసరావు, సిబ్బంది 35 బృందాలుగా ఏర్పడి 287 గృహ సర్వీసులు తనిఖీ చేశారు. అనంతరం పర్చూరు అద్దంకి నాంచారమ్మ అమ్మవారి దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. అదనపు లోడు వినియోగిస్తున్న 287 సర్వీసులకు రూ.8,10,600 జరిమానా విధించామని తెలిపారు. పర్చూరు డీఈఈ జె. శ్రీనివాసులు, చీరాల డీఈఈ హరిప్రసాద్‌రావు, వేటపాలెం డీఈఈ శ్రీనివాసులు, పర్చూరు ఏఈ రమేష్‌నాయక్, చీరాల డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

### నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘ నాయకులు

**లక్ష్మీపురం:** అమరావతి రోడ్డులోని నారాయణ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా పాఠ్య పుస్తకాలను వేల రూపాయలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బండారపు యశ్వంత్ డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో నారాయణ పాఠశాల వద్ద నేతలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ నారాయణ పాఠశాల యాజమాన్యం అధిక ఫీజులతో దోపిడీలకు పాల్పడుతోందని విమర్శించారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి అక్రమంగా పాఠ్య పుస్తకాలు అమ్ముతున్న నారాయణ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడు గండు శివ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నారాయణ, చైతన్య స్కూళ్లలో జరుగుతున్న అక్రమ అడ్మిషన్లను, ఫీజుల దోపిడీలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రణీత్, ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యదర్శి అమర్నాథ్, నగర సహాయ కార్యదర్శి వెంకట్, నగర నాయకులు అజయ్, భాస్కర్, చందు, సాయి గణేష్, సాయి, టి. అజయ్, సతీష్ పాల్గొన్నారు.

### రాష్ట్ర పోటీలకు జిల్లా అథ్లెటిక్ జట్టు ఎంపిక

**గుంటూరు వెస్ట్ (క్రీడలు):** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న ఏపీ సీనియర్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ఎంపిక చేశామని జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14వ తేదీ ఉదయం 6 గంటలకు పోటీలు జరిగే ప్రాంతంలో కోచ్ రవికుమార్‌కు వయస్సు ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డును అందించాలని సూచించారు.

**పురుషులు:** కృష్ణం నాయుడు, మొహిద్దీన్, రోషన్, వెంకట్ గురు శంకర్, ముజ్బర్, మదన్‌మోహన్, యుగంధర్, ప్రసన్న కుమార్, ప్రవీణ్ కుమార్, సుబ్రహ్మణ్యం, మణికంఠ నాయక్, అబ్దుల్లా, అశోక్, ప్రేమ్‌చంద్, తిరుపతిరావు, రాజమోహన్, ఎస్.శంకర్, దీపు, భరత్ కుమార్, డి.మణికంఠ

**మహిళలు:** ఎస్‌కే ఆషా, కె.అంకమ్మ, డి.వైష్ణవి, కె.రేష్మి, కృష్ణ రచన.